క్లుప్తంగా

తొలిరోజు 50 శాతం పింఛన్ల పంపిణీ



క్రోసూరు: మండలంలో ప్రతి నెలా ఒకటవ తేదీన పంపిణీ చేస్తున్న సామాజిక పింఛన్లు తొలిరోజు బుధవారం 50 శాతం పూర్తయ్యిందని ఎంపీడీవో బి.మహేష్ తెలిపారు. మండలంలోని 15 సచివాలయాల పరిధిలో నవంబర్ నెలకు 8,882 మంది లబ్ధిదారులకు రూ.24.61 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. ఆయా గ్రామాల వలంటీర్లు ఇళ్లకు వెళ్లి అందచేస్తున్నట్లు చెప్పారు.

ఇంటింటా జ్వర పరీక్షల సర్వే



రాజుపాలెం: మండల కేంద్రం రాజుపాలెంలో ఇటీవల జ్వరాలు ఎక్కువగా నమోదు కావడంతో ఆరోగ్య సిబ్బంది ఇంటింటి జ్వర పరీక్షల సర్వేను బుధవారం నిర్వహించారు. ఆరోగ్య సిబ్బంది ఆరు టీమ్‌లుగా ఏర్పడి జయంతీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఆర్ అండ్ ఆర్ సెంటర్ లోను, గ్రామంలోను జ్వర పరీక్షలు నిర్వహించగా ఐదుగురికి జ్వరాలు నమోదు అయినట్లు వారికి మలేరియా, డెంగ్యూ పరీక్షలు చేయగా నెగిటివ్‌గా నమోదు అయినట్లు డాక్టర్ కృష్ణకుమార్ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు, ఉషారాణి, సీహెచ్‌వో జ్యోత్స్న, హన్నాకుమారి, శివమాధురి, హెల్త్ అసిస్టెంట్‌లు హుస్సేన్, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



సత్తెనపల్లి: పట్టణంలోని 12వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు వార్డు కౌన్సిలర్ లోక కళ్యాణి బుధవారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో వ్యయ ప్రయాసలతో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తుందని, ప్రతి గర్భిణీ మహిళ వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త భారతి, మహిళా పోలీస్ భవాని కుమారి, వైఎస్సార్ సీపీ నాయకుడు లోక మాధవ ఉన్నారు.

విభజన హామీలు అమలు చేయాలి

ప్రజా రక్షణ యాత్రలో సీపీఎం జిల్లా కార్యదర్శి విజయ్‌కుమార్

నకరికల్లు: తెలుగు ప్రజల త్యాగ ఫలితంగా సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడాలని, రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించాలని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని కుంకలగుంట గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజా రక్షణ యాత్ర బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా రక్షణ యాత్రలో భాగంగా చేపడుతున్న బస్సుయాత్ర ఈనెల 7వ తేదీన సత్తెనపల్లి చేరుకుంటుందన్నారు. పల్నాడు ప్రాంతంలో సాగర్ జలాలు లేకపోవడం వలన సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గిందన్నారు. నాణ్యమైన విద్యుత్‌ను అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఎం పార్టీ రూపొందించిన 30 డిమాండ్‌లతో కూడిన ప్రజా ప్రణాళికకు మద్దతు ఇవ్వాలని గ్రామాలలో పర్యటిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎ.లక్ష్మేశ్వరరెడ్డి, డి.శివకుమారి, షేక్ సీలార్, టి.రెడ్డిరాజు, ఈవూరి లక్ష్మారెడ్డి, జి.పిచ్చారావు, ఈవూరి అప్పిరెడ్డి, సీహెచ్ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ మహరాజ్ మందిరం శంకుస్థాపన

వినుకొండ(నూజెండ్ల): సుగాలీల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ మందిరం, కమ్యూనిటీ హాలు నిర్మాణం చేపట్టడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో సేవాలాల్ మహరాజ్, మందిరం, కమ్యూనిటీ హాలు నిర్మాణాలకు ఎమ్మెల్యే బొల్లా, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలసి శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుగాలీల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అన్ని రంగాలల్లో సుగాలీలకు ప్రాధాన్యత నిస్తున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఒక సుగాలీ మహిళకు మార్కెట్ యార్డ్ చైర్మన్ పదవి ఇచ్చినట్లు గుర్తు చేశారు. వినుకొండలో ఎస్టీలకు గురుకుల పాఠశాల, హాస్టల్ నిర్మాణం జరుగుతున్నట్లు చెప్పారు. రానున్న రోజుల్లో సుగాలీల అభివృద్ధికి పెద్దపీట వేసి అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. కార్యక్రమంలో సుగాలీ నాయకులు కృష్ణా నాయక్, సొసైటీ చైర్మన్ దుమావత్ గోవిందునాయక్, కాంతానాయక్‌లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు ప్రాణ త్యాగ ఫలితమే భాషా ప్రయుక్త రాష్ట్రాలు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు
- ఘనంగా వాడవాడలా ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు

సత్తెనపల్లి: పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగమే భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు నాంది పలికిందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ నాయకుడు పక్కాల సూరిబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి బుధవారం పూలమాల వేసి నాయకులు నివాళులర్పించారు. పక్కాల సూరిబాబు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని నేటితరం యువత అందిపుచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివ రావు, పట్టణ పార్టీ అధ్యక్షుడు షేక్ మౌలాలి, మండల పార్టీ అధ్యక్షుడు రాయపాటి పురుషోత్తమరావు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ నాగూర్‌మీరాన్, పల్నాడు జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు అచ్యుత శివప్రసాద్, పలువురు కౌన్సిలర్లు , ప్రజాప్రతి నిధులు, నాయకులు, వైఎస్ఆర్ సీపీ అనుబంధ సంఘాల బాధ్యులు తతరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ...

ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా స్థానిక గాంధీ చౌక్‌లో సత్తెనపల్లి పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆత్మకూరి వెంకట హరేరామ చెంచయ్య ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు పెరుమాళ్ళ లక్ష్మీశివన్నారాయణ, పట్టణ ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షుడు కాపుగంటి రత్తయ్య, ఆవోపా పట్టణ మాజీ అధ్యక్షుడు దివ్వెల శ్రీనివాసరావు, మార్కెట్ యార్డు డైరెక్టర్ దేవరశెట్టి రవికుమార్, ప్రముఖ న్యాయవాది ఎంవీ సుబ్బారెడ్డి ఉన్నారు.

బీజేపీ కార్యాలయంలో ...

పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ కట్టా శంకరరావు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంకరరావు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగు వారికి ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహారదీక్ష చేసి అసువులు బాసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు కందకట్ల శంకరరావు, జిల్లా కార్యవర్గ సభ్యుడు చందోలు వెంకట మల్లిఖార్జున రావు, గడ్డం శంకర రావు, ప్రధాన కార్యదర్శి గంగధారి మణికంఠ, కోశాధికారి కందకట్ల వెంకట శ్రీనివాసరావు, కార్యదర్శి చలువాది హరికుమార్, చిల్లపల్లి బాలకృష్ణ, సాయి కుమార్, కార్యకర్తలు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సూరిబాబు, నాయకులు

హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ...

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని కేజీబీవీ పాఠశాలలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన శ్రీ బాలాదిత్య మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల వారు ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. కేజీబీవీ ఇన్‌చార్జి ప్రసన్నరాణి మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రం కొరకు ప్రాణాలర్పించిన మహానుభావుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. అనంతరం శ్రీ బాలాదిత్య మల్టీ స్పెషాలిటీ దంత వైద్యశాల డాక్టర్ కె.బాజి బాబు మాట్లాడారు. ముందుగా దంత సమస్యలు ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి సూచనలు, మందులు, పేస్టులను అందించారు. కార్యక్రమంలో హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, ఫౌండేషన్ సభ్యులు నాని, పాల్, పరంజ్యోతి, ఏఎన్ఎం రాజకుమారి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయంలో ....

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు చల్లంచర్ల సాంబశివరావు, మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు, మున్సిపల్ డీఈ బి.మధుసూధన్‌రావు, టీపీఎస్ పి.రాఘవరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.విజయసారథి, కౌన్సిలర్ పెద్దింటి వెంకటేశ్వర్లు (చిట్టి), మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పొట్టిశ్రీరాములు త్యాగనిరతి ఆదర్శప్రాయం

అచ్చంపేట: మహనీయులు పొట్టిశ్రీరాములు త్యాగం వల్లనే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఏర్పడిందని, వారి త్యాగనిరతి ఆదర్శప్రాయమని జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి అన్నారు. మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు గుండా రమేష్ ఆధ్వర్యంలో రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక రామాలయం సెంటర్‌లో పొట్టి శ్రీరాములు, గాంధీ విగ్రహాలకు బుధవారం పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ మహనీయుల త్యాగాలు వృథా కానీయరాదన్నారు. వారి ఆమరణ నిరాహార దీక్షతో సిద్ధించిన రాష్ట్రాన్ని కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాముల గ్రామ స్వరాజ్య ఆశయసాధన కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అహర్నిశలు కృషి చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిల్కా చంద్రయ్య, వైస్ ఎంపీపీ గంగసాని బాబు, అచ్చంపేట సర్పంచ్ కంబాల వీరబాబు, ఉప సర్పంచ్ షేక్ జాని, టౌన్‌పార్టీ కన్వీనర్ షేక్ సమరం, మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు గుండా రమేష్ బాబు, వర్తక సంఘ నాయకులు సూరే సుబ్బారావు, ఆర్యవైశ్య ప్రముఖులు సూరే సాంబశివరావు, ఏలూరి శ్రీనివాసరావు, దాసరి లక్ష్మీ మంగేశ్వర రావు, పొట్టి శ్రీనివాసరావు, పులిపాటి శంకర్, గుండా వెంకటేశ్వరరావు, గుండా రాజేష్, వీరవల్లి కిషోర్, అనుముల శేషగిరి, మార్కెట్ యార్డు డైరెక్టర్ ఆకుల కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



గాంధీచౌక్‌లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

అమరజీవి పొట్టి శ్రీరాములుకు నివాళి

అమరావతి: ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘనంగా నివాళులర్పించారు. తొలుత పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మండల పరిషత్ అధ్యక్షుడు మేకల హనుమంతరావు మాట్లాడుతూ రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన మహానుభావుడిని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకోవటమే కాక ఆయనలోని దేశభక్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఉమాదేవి, ఎంఈవోలు శ్రీనివాసరావు, శివబాబు, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, విద్యార్థులు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కేజీబీవీలో దంత వైద్య శిబిరంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు బాజి బాబు

ముప్పాళ్లలో అమరజీవికి ఘన నివాళి

ముప్పాళ్ళ: మండలంలో పలు చోట్ల ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న పొట్టిశ్రీరాములు విగ్రహానికి జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు బొండా వెంకటేశ్వరరావు, అనుమాలశెట్టి శ్రీనివాసరావు, శ్రీరంగనాయకులు, కనక కృష్ణారావు, రావిక్రింది సుబ్బారావు, తాడేపల్లి కోటిలింగం, మోహన్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. పలు గ్రామ సచివాలయాల్లోనూ ఆంధ్రరాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అమరజీవి పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

బెల్లంకొండ: ప్రత్యేక రాష్ట్రం పోరాట సాధకుడు, అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు బుధవారం మండలంలోని వివిధ గ్రామాలలో ఘనంగా జరిగాయి. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మావెంకటేశ్వర రెడ్డి, ఎంపీడీవో బి.వెంకటరెడ్డి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రత్యేక రాష్ట్ర సాధనకు ప్రాణాలకు సైతం తెగించి ఆమరణ నిరాహార దీక్ష చేసిన యోధుడు పొట్టి శ్రీరాములు అని ఎంపీపీ కొనియాడారు. మండలంలోని వెంకటాయపాలెం, మన్నెసుల్తాన్‌పాలెం , పాపాయపాలెం, మాచాయపాలెం, నాగిరెడ్డిపాలెం, చంద్రాజుపాలెం, వన్నాయపాలెం, కందిపాడు గ్రామాలలోని సచివాలయాలలో సర్పంచ్‌లు, సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ అహ్మద్ పాషా, ప్రసన్నాంజనేయ స్వామి టెంపుల్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ మర్రి ప్రసాదరెడ్డి, సర్పంచ్‌లు కొడవటి బాబూజీ, దారం రమణారెడ్డి, నరసింహా నాయక్, గుడిసె నాగిరెడ్డి, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములుకు నివాళులర్పించి మాట్లాడుతున్న ఎంపీపీ మేకల హనుమంతరావు



ముప్పాళ్ళలో పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు



పొట్టిశ్రీరాములు, మహాత్మాగాంధీ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పిస్తున్న ప్రముఖులు



బెల్లంకొండలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

రైతులు, నిరుద్యోగులను ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం

సత్తెనపల్లి: ఔత్సాహిక రైతులు, నిరుద్యోగులను ప్రోత్సహించేందుకే జాతీయ లైవ్ స్టాక్ మిషన్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా ఇన్‌చార్జ్ పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ రామారావు అన్నారు. పట్టణంలోని పశు వైద్యశాలలో సత్తెనపల్లి, ముప్పాళ్ళ, అమరావతి, పెదకూరపాడు, రాజుపాలెం, క్రోసూరు, అచ్చంపేట మండలాల పరిధిలో గల సహాయ సంచాలకులు, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లకు, పారా సిబ్బంది, యానిమల్ హస్బెండరీ అసిస్టెంట్లకు, గోపాల మిత్రులకు బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. డాక్టర్ రామారావు మాట్లాడుతూ గ్రామీణ స్థాయిలో పశుపోషణ ద్వారా ఆర్థిక పురోగతికి జాతీయ లైవ్ స్టాక్ మిషన్ నిధులతో 2021-22 నుంచి 2025-26 సంవత్సరాల కాలపరిమితిలో రైతులను వ్యాపార సరళిలో ప్రోత్సహించేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ఈ సందర్భంగా పలు పథకాల గురించి వివరించారు. సమావేశంలో డాక్టర్ నరసింహులు, డాక్టర్ మంగు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనపై విద్యార్థి దశ నుంచే అవగాహన ఉండాలి

సీజీజీబీ విజిలెన్స్ అధికారి రాంబాబు



బెల్లంకొండలో బహుమతులు పొందిన విద్యార్థులతో బ్యాంక్ అధికారులు

బెల్లంకొండ: అవినీతి నిర్మూలనపై విద్యార్థి దశ నుంచే అవగాహన కలిగి ఉండాలని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు గుంటూరు ప్రధాన శాఖ విజిలెన్స్ అధికారులు ఇ.రాంబాబు, వి.వినయ్‌కుమార్‌లు తెలియజేశారు. మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను బ్యాంకు ఆధ్వర్యంలో స్థానిక బ్రాంచ్ మేనేజర్ కె.నాగలక్ష్మయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. చిన్నతనం నుంచి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని విద్యార్థులు చదువుకోవాలని సూచించారు. ఎంచుకున్న రంగాలలో అవినీతికి తావు లేకుండా , అవినీతి నిర్మూలనే ధ్యేయంగా ముందుకు సాగాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రాంగణంలో బ్యాంకు అధికారులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సీహెచ్ శ్రీనివాసరావు, బ్యాంకు ఆఫీసర్ హరిప్రసాద్, చిన్నా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడలతో విద్యార్థుల్లో పోటీతత్వం

సత్తెనపల్లి డీఎస్పీ ఆదినారాయణ

సత్తెనపల్లి: క్రీడల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని సత్తెనపల్లి డీఎస్పీ బి.ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని భవిష్య పాఠశాలలో వార్షిక క్రీడా దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై క్రీడా జ్యోతిని వెలిగించి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఆదినారాయణ మాట్లాడుతూ విద్యార్థుల ఆసక్తిని గమనించి ఉపాధ్యాయులు, తల్లి దండ్రులు వారిని ప్రోత్సహించాలన్నారు. విద్యార్థులు ఆటలు ఆడటం వల్ల ఏకాగ్రత, ఓర్పు, నైపుణ్యం అన్నీ అలవాడతాయన్నారు. విద్యార్థులు నిత్యం ఒక గంటపాటు సైక్లింగ్, వాకింగ్, యోగా వంటివి చేసి శారీరకంగా దృఢంగా తయారవ్వాలని సూచించారు. విద్యార్థుల్లో కొంతమంది స్వతహాగా నైపుణ్యాన్ని కలిగి ఉంటారన్నారు. అలాంటి వారిని గుర్తించి సరైన శిక్షణ ఇవ్వాలని సూచించారు. పాఠశాల డైరెక్టర్ లయన్ ఐ.శ్రీధర్ మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరకంగానే కాక మానసికంగా కూడా వృద్ధి చెందుతారన్నారు. క్రీడల వల్ల జ్ఞాపకశక్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయన్నారు. ఈ సందర్భంగా పలు క్రీడలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల డీన్ ఐ.ఉమాకళ్యాణి, పీఈటీ సుదర్శన్‌రావు, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ దరియా, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



భవిష్య పాఠశాలలో డీఎస్పీ ఆదినారాయణకు మెమెంటో అందిస్తున్న పాఠశాల డైరెక్టర్ శ్రీధర్

సబ్సిడీపై శనగ విత్తనాలు పంపిణీ

ఊటుకూరు(క్రోసూరు): ప్రభుత్వం రైతులకు 40 శాతం సబ్సిడీపై అందిస్తున్న శనగ విత్తనాలను మండలంలోని ఊటుకూరు గ్రామంలో ఎంపీపీ పి.కోటయ్య, వ్యవసాయాధికారులు రైతులకు బుధవారం పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రైతులకోసం సీఎం జగన్‌మోహన్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని అన్నారు. ప్రతి రైతుకు పెట్టుబడి సాయం రూ.13,500 వారి ఖాతాల్లో జమ చేయటం జరుగుతుందన్నారు. కౌలు రైతుల, రైతులకు ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పంట నష్టపరిహారం, ఉచిత బీమా తదితర కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఏడీఏ హనుమంతరావు మాట్లాడుతూ రైతులకు 40 శాతం సబ్సిడీపై శనగ విత్తనాలు అందిస్తున్నట్లు తెలిపారు. శనగ విత్తనాల ధర రూ.81 ఉండగా సబ్సిడీ రూ.32.40 పోను రైతులు కేవలం రూ.48.60 చెల్లించాల్సి ఉంటుందన్నారు. శనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో సంప్రదించి పొలం పాస్‌పుస్తకం ,ఆధార్ నంబర్ ద్వారా విత్తనాలు పొందవచ్చునన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో వేణుగోపాల్, గ్రామ సర్పంచ్ జెర్రిపోతు బుచ్చయ్య, జొన్నవరపు శ్రీనివాసరెడ్డి, అల్లురెడ్డి, రైతులు, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.



శనగ విత్తనాలు అందిస్తున్న ఎంపీపీ పి.కోటయ్య

అందరికీ బ్లడ్‌గ్రూపు ఏమిటో తెలిసుండాలి

నరసరావుపేట: ఆంధ్ర రాష్ట్రావతరణ దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మీ బ్లడ్ గ్రూపు తెలుసుకోండి (నో యువర్ బ్లడ్ (గ్రూపు) అనే పేరుతో కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్. ఎస్పీ రవిశంకర్‌రెడ్డి. జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బ్లడ్ గ్రూపింగ్ విధానం పరిశీలించి ఎస్పీ, జేసీతో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు వారి బ్లడ్ గ్రూప్‌లను పరీక్షించుకున్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ రక్తం ఏ గ్రూపుకు చెందినదో తెలుసుకొని ఉండటం చాలా అవసరమన్నారు. త్వరలోనే నరసరావుపేటలో రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ అందుబాటులోకి రానుందన్నారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి గ్రామం, మండలం, కళాశాలలు, పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులు, సామాన్య ప్రజలకు కూడా పూర్తిగా ఉచితంగా నిర్వహిస్తామన్నారు. ఈ బ్లడ్ గ్రూపింగ్ క్యాంప్ మీ ప్రాంతాలలో నిర్వహించాలని అనుకుంటే 91000 78576కి కాల్‌చేసి సంప్రదించాలని కోరారు. రెడ్ క్రాస్ వైస్‌చైర్మన్ పీవీఎం శరత్‌బాబు, మేనేజింగ్ కమిటీ సభ్యులు కేఎంఎస్‌వీ శ్రీనివాస గుప్తా, బత్తుల మురళి, డాక్టర్ రహమతుల్లా, బ్లడ్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ మురళీధర్, జిల్లా అధికారులు, వలంటీర్స్ పాల్గొన్నారు.



బాలికకు కార్డు అందజేస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా నిరసన

పిడుగురాళ్ల: పట్టణంలోని లెనిన్‌నగర్‌లో పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులకు వ్యతిరేకంగా పీడీఎం ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు అత్యంత పాశవికంగా ఉన్నాయని, పసి పిల్లలు, మహిళలు అనే తేడా లేకుండా వేలమంది నిత్యం మృత్యువాత పడుతున్నారన్నారు. అమెరికా అండదండలతో బరితెగించిన ఇజ్రాయెల్ ముష్కర దాడులతో గాజా నగరాన్ని ధ్వంసం చేస్తుందన్నారు. ఐక్యరాజ్యసమితితో 123 దేశాలు దాడులను ఆపాలని డిమాండ్ చేసినా ఆపటం లేదని అన్నారు. ఇజ్రాయెల్‌కు మద్దతు తెలపటం వెనుక మోదీ ప్రభుత్వం తీరు అర్థమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎం రాష్ట్ర అధ్యక్షులు కె.శ్రీనివాసరావు, పీడీఎం నాయకులు వైవీ షేక్ మస్తాన్‌వలి, భారత్ బచావో పల్నాడు జిల్లా అధ్యక్షులు వి.కోట నాయక్, సీపీఎం పార్టీ అధ్యక్షులు తెలగపల్లి శ్రీనివాసరావు, సీపీఐ పట్టణ కార్యదర్శి జె.కృష్ణనాయక్, ఎంసీపీఐ జిల్లా అధ్యక్షులు ఓర్స్ కృష్ణ పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు శావల్యాపురం బాలికలు

శావల్యాపురం: రాష్ట్ర స్థాయి బాల్‌బ్యాడ్మింటన్ క్రీడా పోటీల్లో 10 మంది విద్యార్థినులు ఎంపికైనట్లు శావల్యాపురం హైస్కూలు ప్రధానోపాధ్యాయురాలు బోడ్డపాటి విజయలక్ష్మి బుధవారం తెలిపారు. స్కూల్ గేమ్స్ విభాగంలో 10 మంది బాలికలు గత నెల 28న గవర్నమెంటు ఉర్దూ బాయ్స్ హైస్కూలు ఉమ్మడి గుంటూరు జిల్లా బాల్‌బ్యాడ్మింటిన్ గేమ్ నందు బాలికల విభాగంలో అండర్-14, అండర్-17 విభాగాల్లో ప్రథమస్థానం సాధించటంతో పాటు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అండర్-14 విభాగంలో టి.అంజన, ఆర్.రత్నకీర్తన, శ్రీహర్షత, రవళీ, లలితా, అండర్-17 విభాగంలో ఆకుమళ్ళ సమీరా, కె.కావ్య, యం.లూధియా, వేముల దివ్య, ఉప్పు బసవరాణిలు ఎంపికైనారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలికల జట్టు 4 నుంచి 6 వరకు పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా అత్మకూరు జరిగే పోటీల్లో పాల్గొంటారని పీడీ రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఎంపికైనా బాలికలను పాఠశాల ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, అబ్దుల్లా, భువనేశ్వరీ, నిర్మల, ఆదాంఖాన్, శ్రీకృష్ణ, రవి, శ్రీకాంత్ అభినందించారు.

పెయింటింగ్ డబ్బాల వాహనం బోల్తా



యడ్లపాడు: మండలంలోని తిమ్మాపురం పరిధిలో 16వ జాతీయ రహదారిపై ఆటో బోల్తా పడిన సంఘటన బుధవారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గుంటూరు నుంచి చిలకలూరిపేట వైపు పెయింటింగ్ డబ్బాలలోడుతు వస్తున్న ఫోర్‌వీల్ ఆటోకు తిమ్మాపురం చేపల చెరువు సమీపంలోకి రాగానే టైర్ పంక్చర్ అయింది. దీంతో వేగంలో ఉన్న ఆటో ఒక్కసారిగా అదుపుతప్పి పల్టీ కొట్టింది. ఖరీదైన రంగు డబ్బాలు కిందపడ్డాయి. ప్రమాదంలో ఆటో పాక్షికంగా దెబ్బతినగా, రంగులు రోడ్డు పాలు య్యాయి. డ్రైవర్ ప్రసాద్ సురక్షితంగా బయటపడ్డాడు. నిత్యం ఎంతో రద్దీగా ఉండే హైవేపే ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో పెను ప్రమాదం తప్పిందంటూ స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

నాడు-నేడు పనులను పరిశీలించిన ట్రైనీ కలెక్టర్

బొల్లాపల్లి: మండలంలోని ఘాటితండాను జిల్లా ట్రైనీ కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ బుధవారం సందర్శించారు. తండాలోని ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు పనులను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న నాడు-నేడు పనులను పరిశీలించి వివరాలను సేకరించారు. త్వరగా పనులు పూర్తిచేయాలని విద్యార్థులకు సౌకర్యాలు పూర్తిస్థాయిలో కల్పించాలని ఆదేశించారు. గత ప్రధానోపాధ్యాయులు నిర్లక్ష్యంతో పనులు అసంపూర్తిగా మిగిలాయని, కొంత మేర నిధుల కొరత వలన జాప్యం జరిగిందని ట్రైనీ కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ తండా నుంచి స్పందనలో కలెక్టర్‌కు అందిన ఫిర్యాదు మేరకు రావడం జరిగిందని, కలెక్టర్ ఆదేశానుసారం విచారణ జరిపి నివేదికను అందజేస్తామని ట్రైనీ కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో నాణ్యతలేని పోషకాహారం అందజేస్తున్నారని తండావాసి ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామన్నారు. వెల్లటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో నరసరావుపేట అసిస్టెంట్ చైల్డ్ డెవలప్‌మెంట్ పీవో బి.మాణిక్యరావు, తహసీల్దార్ ఎన్.దుర్గేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో షేక్ జిలానీబాషా, ఎంఈవో 2 కె.పార్వతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఆర్.పద్మజారాణి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్త, తండావాసులు పాల్గొన్నారు.



ప్రభుత్వ హాస్టళ్లలో నూతన సదుపాయాలు ప్రారంభం

నరసరావుపేట: పట్టణంలోని రైల్వేస్టేషన్ సమీపంలో గల సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్, ఆనందనిలయం హాస్టల్‌లో రూ.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను దాత రిటైర్డు ఐఎఫ్ఎస్ అధికారి జూపూడి ప్రసాదు బుధవారం ప్రారంభించారు. దీనికి ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు హాజరయ్యారు. ఈ రెండు హాస్టళ్లలో జూపూడి ప్రసాదు తన తల్లితండ్రులు డేవిడ్, నాగమ్మల జ్ఞాపకార్థం వారిపేర్లపై రూ.4 లక్షలతో వాటర్ ప్లాంట్, రెండు సింటెక్స్ ట్యాంకులు, పైపులు, రెండు హాస్టళ్లకు రంగులు వేయించారు. వీటిని జేసీ శ్యామ్‌ప్రసాదు పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ అధికారి ఓబులు నాయుడు, పలువురు అధికారులు పాల్గొన్నారు.